క్లుప్తంగా

16 నుంచి మహా చండీయాగం



యాగశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న చక్రపాణి, తదితరులు

సిరిసిల్లటౌన్: శివభక్త మార్కండేయ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి సిరిసిల్లలో మహా చండీయాగం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను మంగళవారం పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జిందం చక్రపాణి పరిశీలించారు. లోక కల్యాణార్థం చేపట్టే మహాక్రతువులో పట్టణ ప్రజలంతా పాల్గొనాలన్నారు. పద్మశాలీ కల్యాణ భవన్ అధ్యక్షుడు గుండ్లపెల్లి శ్రీనివాస్, చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు గుజ్జె తార, బాలయ్య, బొజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న అన్నారం శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: జిల్లాలోని నెహ్రూనగర్‌కు చెందిన ఓ నిరుపేద చికిత్స కోసం సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ చేయూత అందించారు. నెహ్రూనగర్‌కు చెందిన నంది రవీందర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయాన్ని కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ప్రభుత్వం ద్వారా రూ.2లక్షల ఎల్‌వోసీని మంజూరుచేయించగా మంగళవారం కౌన్సిలర్ బాధిత కుటుంబానికి అందజేశారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక



వేములవాడ: హర్యానాలో ఈనెల 16 నుంచి 19 వరకు నిర్వహించే జాతీయస్థాయి కరాటే పోటీలకు పట్టణానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఉప్పుల పవన్‌రాజ్ ఎంపికయ్యారు. పవన్‌రాజ్‌ను స్కూల్ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్లు శాలువాతో సన్మానించి నగదు బహుమతి అందించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ ధరక్షన్ వస్పియా, టీచర్స్, కరాటే మాస్టర్ మన్నాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

బోయినపల్లి: కరీంనగర్ సూర్య నర్సింగ్ హోం ఆధ్వర్యంలో మండలంలోని స్తంభంపల్లి జీపీ కార్యాలయ పరిసరాల్లో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అక్కెనపెల్లి జ్యోతి కరుణాకర్, మాజీ జెడ్పీటీసీ పులి లక్ష్మీపతి, అక్కెనపెల్లి కరుణాకర్, పంచాయతీ కార్యదర్శి మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

రుద్రంగి: ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని వైద్యురాలు అర్చన అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం విజయ, ఆశాలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

ముస్తాబాద్: మండలానికి 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.39లక్షల 41,550 మంజూరయ్యాయని ఎంపీవో బీరయ్య మంగళవారం తెలిపారు. 22 గ్రామ పంచాయతీల అకౌంట్లలో కేంద్ర ప్రభుత్వ నిధులు జమ అయినట్లు తెలిపారు. వీటిద్వారా అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. ఇప్పటికే ఆయా పంచాయతీల్లో చేపట్టిన పనులకు నిధులు వినియోగించనున్నామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ముస్తాబాద్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి గీతాంజలి అన్నారు. మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు సీజనల్ వ్యాధులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ డెంగీ, ఇతరత్రా వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీలత, ఏఎన్‌ఎం కొల్లూరి రేణుక, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ కోసం స్థల పరిశీలన

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి ఇటీవల సబ్‌స్టేషన్ మంజూరుకాగా వేములవాడ రూరల్ తహసీల్దార్ సుజాత మంగళవారం గ్రామస్తులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, మాజీ ఎంపీటీసీ భూమయ్య, కత్తి కనుకయ్య తదితరులున్నారు.

బురదమయంగా రోడ్లు

- దేశాయిపల్లి, విలాసాగర్ కల్వర్టుల వద్ద రహదారులు అధ్వానం
- చినుకుపడితే చిత్తడే..
- ఏళ్ల తరబడి ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



దేశాయిపల్లి కల్వర్టు వద్ద బురద రోడ్డుపై ప్రయాణికుల తిప్పలు

బోయినపల్లి: మండలంలోని దేశాయిపల్లి, విలాసాగర్ గ్రామ పరిసరాల్లో వరద కాల్వ కల్వర్టుల వద్ద రోడ్లు అధ్వానంగా మారాయి. కల్వర్టు చివర్లలో మట్టి రోడ్లపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. బోయినపల్లి నుంచి కొదురుపాక వెళ్లే డబుల్ రోడ్డులో దేశాయిపల్లి వరదకాలువ కల్వర్టు పరిసరాలు, విలాసాగర్ కల్వర్టు వద్ద రెండు చోట్ల సుమారు అర కిలోమీటర్ మేర మట్టిరోడ్డు పూర్తిగా బురదమయమైంది. ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో ఆరేళ్ల క్రితం రూ.10 కోట్ల అంచనాలతో బోయినపల్లి నుంచి కొదురుపాక వరకు 7 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మించారు. డబుల్ రోడ్డు వేయకముందు 15 ఏళ్ల క్రితం దేశాయిపల్లి గ్రామ పరిసరాల్లో మిడ్‌మానేర్ ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ, కాళేశ్వరం ప్రాజెక్టుల నీటితో పాటు, వరదనీరు వెళ్లేందుకు రోడ్డు మధ్యలో పెద్ద వరదకాలువ నిర్మించారు. ఆ సమయంలో కల్వర్టు పరిసరాల్లో అర కిలోమీటర్ సిమెంట్ రోడ్డు వేశారు. అనంతరం సిమెంట్ రోడ్డు లేచిపోయింది. డబుల్ రోడ్డు వేసినప్పుడు కల్వర్టు పరిసరాల్లో బీటీ వేయలేదు. దీంతో ఏటా వర్షాకాలంలో రోడ్డు పరిసరాలు బురదతో నిండిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగుల వంశీ ఆధ్వర్యంలో శ్రమదానం చేసి మొరం పోశారు. పీఆర్ పరిధిలోని మర్లపేట, విలాసాగర్ పరిసరాల్లో ఉన్న వరద కాల్వ కల్వర్టు వద్ద రోడ్డు దుస్థితి ఇలాగే ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. గతంలో పలుసార్లు దేశాయిపల్లి కల్వర్టు వద్ద బురద మట్టిని ఫ్రంట్ బ్లేడ్ ట్రాక్టర్‌తో తీసి రోడ్డుపక్కకు పోశారు.



మర్లపేట వరద కాల్వ కల్వర్టు వద్ద రోడ్డుపై గుంతలు

ఏళ్లుగా ఇబ్బంది

కొదురుపాక వెళ్లే డబుల్ రోడ్డుపై నిత్యం వాహనాలు రాకపోకలు సాగుతాయి. రోడ్డువేసి సుమారు ఆరేళ్లు గడుస్తున్నా కల్వర్టు పరిసరాల్లో మట్టిరోడ్డు ఉండగా తారు రోడ్డు వేయడం లేదు. విలాసాగర్, మర్లపేట పరిసరాల్లో ఉన్న కల్వర్టు వద్ద సైతం పరిస్థితి ఇలాగే ఉంది. వర్షాలు కురిస్తే రెండు కల్వర్టుల పరిసరాల్లో రోడ్డు మొత్తం బురదమయంగా మారుతోంది.

అధ్వానంగా ఉంది



దేశాయిపల్లి వరదకాలువ కల్వర్టు పరిసరాల్లో అరకిలోమీటర్ మేర మట్టి రోడ్డు అధ్వానంగా ఉంది. కల్వర్టుకు ఇరువైపులా డబుల్ రోడ్డు వేశారు. కల్వర్టు వద్ద అరకిలోమీటర్ వరకు రోడ్డు వేయలేదు. దీంతో వర్షాకాలంలో రోడ్డు మొత్తం చెడిపోతుంది. బురదకు రోడ్డుపై వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

– తడుక రాజు, కొదురుపాక

బీటీ రోడ్డువేయాలి



బోయినపల్లి కొదురుపాక రోడ్డులో దేశాయిపల్లి వరద కాల్వ వంతెన వద్ద, మర్లపేట వరదకాల్వ వంతెన వద్ద వర్షాకాలంలో అడుగుతీసి వేయలేని విధంగా బురద ఉంటుంది. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులు రెండు వరద కాల్వల పరిసరాల్లో బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేసి రోడ్డు వేయాలి.

– నిమ్మ శ్రీనివాసరెడ్డి, దేశాయిపల్లి

ఇబ్బందిగా ఉంది



బోయినపల్లి, మర్లపేట నుంచి విలాసాగర్ వెళ్లే దారిలో ఉన్న వరదకాల్వ పరిసరాల్లో రోడ్డు అధ్వానంగా మారడంతో ఏళ్ల తరబడి ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. కల్వర్టు పరిసరాల్లో బీటీరోడ్డు లేకపోవడంతో రోడ్డంతా గుంతలమయమైంది. ఓవైపు గుంతలు, మరో వైపు చెట్ల కొమ్మలు ఉన్నాయి.

– లెంకల సత్యనారాయణరెడ్డి, మర్లపేట

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ముస్తాబాద్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో వాలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ సౌజన్యంతో నగదు రహిత లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ కౌన్సిలర్ రమేశ్ మాట్లాడుతూ స్క్రీన్ షేరింగ్ యాప్ ద్వారా సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల ద్వారా ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు మోసపోతే వారు వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. అధ్యాపకులు ప్రభాకర్, వాణి, ధర్మపురి, శ్రావన్, అంజనేయులు, ఆది, భిక్షమయ్య, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కోనరావుపేట: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కార్గో లాజిస్టిక్ సేవలను వినియోగించుకోవాలని టీఎస్‌ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ కార్గో ఏటీఎం వి.రామారావు అన్నారు. మండలంలోని నిమ్మపల్లిలో ఏర్పాటు చేసిన కార్గో సేవలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి సేవలు సిరిసిల్ల తర్వాత మండలంలో తొలిసారిగా ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శేఖర్, ఏజెంట్ శివ, నాయకులు మర్యాల శేఖర్, అజీంపాషా, భూపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం కూల్చివేతపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ముస్తాబాద్: మండలంలోని మోహినికుంటలో ప్రభుత్వం నిర్మించిన చెక్‌డ్యాంను కూల్చివేశారని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు రైతు మల్లేశ్ ఫిర్యాదు చేశారు. కొంతమంది రైతులు చెక్‌డ్యామ్ భూములను ఆక్రమించుకునేందుకు దానిని ధ్వంసం చేశారన్నారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడరూరల్: పోస్టల్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. వట్టెంల బ్రాంచ్ కార్యాలయంలో మంగళవారం పోస్టల్ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. టాటా జీఏజీ ప్రమాద బీమా పాలసీ తీసుకుంటే, అనుకోని ప్రమాదం జరిగితే కుటుంబానికి కొండంత అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం బోయినపల్లి సబ్ ఆఫీస్ ఎస్పీఎం మంచాల విఠోబా స్వామి, వట్టెంల బీపీఎం రాజును సన్మానించారు. కార్యక్రమంలో మేయిల్ ఓవర్సీస్ దాది మల్లేశం, పోస్టల్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● హామీల అమలుకు పోరాటం

సిరిసిల్లటౌన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు పోరాటం చేయాల్సిన తరుణం ఆసన్నమైందని రైతుసంఘం రాష్ట్ర నాయకుడు మంద సుదర్శన్ అన్నారు. సిరిసిల్లలోని కార్మిక భవన్‌లో మాట్లాడారు. కౌలు రైతులకు రుణాలు వర్తించాలని, వ్యవసాయ కూలీలకు ఏడాదికి ఇస్తామన్న రూ.12వేలు అందించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టీపీరెడ్డి తిరుపతిరెడ్డి, కోనేటి పరుశురాం, కార్యదర్శి అంజయ్య, సహాయ కార్యదర్శి కనుకయ్య, కోశాధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

● వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులు పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని పొత్తూరు గ్రామ మానేరు బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ చేశారు. సరైనపత్రాలు లేని వారికి జరిమానా విధించారు.

● విలీన గ్రామాలను జీపీలుగా ఏర్పాటు చేయాలి

సిరిసిల్ల అర్బన్: విలీన గ్రామాలను తిరిగి గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని విలీన గ్రామాల ఐక్యవేదిక నాయకుడు అనిల్ కుమార్ ఓ ప్రకటనలో కోరారు. అసెంబ్లీఎన్నికల సమయంలో కేకే మహేందర్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలుపుకోవాలన్నారు.

● పంటను ధ్వంసం చేశారని ఆందోళన

కోనరావుపేట: 20 ఏళ్లుగా సాగు చేస్తున్న భూమిలో అటవీ అధికారులు పత్తిపంటను, చెట్లను తొలగించారని మండలకేంద్రానికి చెందిన నిరుపేద దంపతులు ఆరోపించారు. బాధితుల కథనం ప్రకారం... మండలకేంద్రానికి దండుగుల పోశవ్వ– కనుకయ్య దంపతులకు చెందిన సర్వే నెంబర్ 367లోని మూడెకరాల భూమిని గత ఇరవై ఏళ్లనుంచి సాగు చేస్తున్నారు.2010లో పట్టాలివ్వగా అప్పటి నుంచి భూమిలో పంటలు సాగుచేస్తున్నారు. అటవీ అధికారులు ఈ భూమి అటవీశాఖకు చెందిందని, పంటను ధ్వంసం చేశారు. ఈభూమి తప్ప తమకు వేరే ఆధారంలేదని, మా భూమిని తమకు ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.

● డీటీవో కార్యాలయం తనిఖీ

సిరిసిల్ల క్రైమ్: రోడ్డు రవాణా శాఖ కార్యాలయాన్ని ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పురుషోత్తం మంగళవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా కమిషనర్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

● సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లటౌన్: అపరిష్కృ సమస్యలు వెంటనే పరిష్కంచాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ..మధ్యాహ్న భోజన పథకాన్ని హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్‌కు ఇచ్చే ఆలోచన మానుకోవాలన్నారు. ఆరోగ్యహెల్త్ ఇన్సూరెన్స్ రూ. 5లక్షలు అందివ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీధర్, నాయకులు అన్నల్‌దాస్ గణేశ్, బొంగోని అశోక్, తదితరులు పాల్గొన్నారు.

● మానవత్వం చాటుకున్న మజీద్ కమిటీ అధ్యక్షుడు

సిరిసిల్ల క్రైమ్: పట్టణానికి చెందిన రాము అనే లారీడ్రైవర్ మద్యానికి బానిసకాగా కుటుంబీకులు మందలించడంతో ఆత్మహత్య చేసుకుంటాననటూ సోమవారం అర్ధరాత్రి ఇంట్లోంచి వెళ్లి నిద్రమాత్రలు మింగాడు. సిరిసిల్ల శివారులోని రాడీచౌరస్తా సమీపంలో రోడ్డు పక్కన స్పృహ కోల్పోయి పడి ఉండగా అటుగా వెళ్తున్న సిరిసిల్ల మజీద్ కమిటీ అధ్యక్షుడు ముస్తఫా గమనించారు. వెంటనే తన బైక్‌పై రాముని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించాడు.

● బకాయిల చెల్లింపుపై కళాప్రదర్శన

రుద్రంగి: వాహనాల రవాణా త్రైమాసిక ఫీజులు, టాక్స్ బకాయిల చెల్లింపుపై జిల్లా రవాణ శాఖ అధికారులు, తెలంగాణ సాంస్కృతిక సారధి పాత్తూరి రాజు కళాబృందం ఆధ్వర్యంలో మండలకేంద్రంతో పాటు మానాల, గిరిజన తండా గ్రామాల్లో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న టాక్స్ బకాయిలు 50 శాతం ఫెనాల్టీతో స్వచ్ఛందంగా వాహన వినియోగదారులు చెల్లించాలన్నారు. టీం లీడర్ పాత్తూరి రాజు, కళాకారులు గడ్డం దేవయ్య, సంజీవ్, ఝాన్సీ పాల్గొన్నారు.

వీర్నపల్లి: రవాణా వాహనాల త్రైమాసిక ఫీజులు, ట్యాక్సీ బకాయిల చెల్లింపులపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం కళాప్రదర్శన నిర్వహించారు. సాంస్కృతిక సారథి ఎద్మల శ్రీధర్‌రెడ్డి కళాకారులు రామచంద్రం, గడ్డం శ్రీనివాస్, గుగ్గిళ్ల పర్శరాములు, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీ నాయకుల ర్యాలీ

వేములవాడ: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా వేములవాడలో బీజేపీ నాయకులు అంబేడ్కర్ చౌరస్తా నుంచి అమర వీరుల స్తూపం వరకు మంగళవారం రాత్రి సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. కౌన్సిలర్ రేగుల సంతోష్‌బాబు, బీజేపీ రూరల్ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్ గూడూరి భాస్కర్ మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు, నాయకులు భాస్కర్ గౌడ్, రాజు, వినయ్, ఆశీర్వాద్, అరుణ్ కుమార్, పాల్గొన్నారు.

బదిలీలు చేపట్టాలని నిరసన

ఇల్లంతకుంట: ప్రభుత్వం బదిలీలు చేపట్టాలని రహీంఖాన్‌పేట మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. రాష్ట్ర మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్‌ఎంఎస్‌టీఎఫ్) రాజన్నసిరిసిల్ల అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నిప్రభుత్వ విభాగాలకు బదిలీలు నిర్వహించిన ప్రభుత్వం మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీల విషయంలో తాత్సారం చేస్తోందన్నారు. 21న ధర్నాచౌక్‌లో జరిగే నిరాహార దీక్షలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోనరావుపేట: మండలంలోని కనగర్తి శివారులో పొలాల వద్ద విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. కిందికి వేలాడుతూ ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు లూజ్‌వైర్లను సరిచేసి చేయాలని ప్రమాదం జరగకుండా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

– సందూరి సతీశ్, కనగర్తి

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346626

నేడు కోనరావుపేట బంద్

కోనరావుపేట: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బుధవారం కోనరావుపేట బంద్‌ను విజయవంతం చేయాలని హిందూ ఐక్యవేదిక బాధ్యులు గొట్టె రామచంద్రం కోరారు. బంద్‌కు ప్రజలు సహకరించాలని కోరారు.

స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలి



సిరిసిల్లటౌన్: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉంటున్న స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని సిరిసిల్ల వికాస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజులు విడుదలలో జాప్యం చేయొద్దంటూ మంగళవారం పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. కళాశాలలోని 500 మంది విద్యార్థులు పెండింగ్ ఫీజులు వెంటనే అందించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు రాసి సిరిసిల్లలోని పోస్టుబాక్సుల్లో వేశారు. కాంగ్రెస్ సర్కారు పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఫీజులు విడుదల చేయాలని కోరారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి సన్నిధిలో శ్రావణమాసం సందర్భంగా మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 6 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	2	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	29	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	02	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	20	1,008
నందీశ్వర్ నాన్‌ఏసీ	26	560
నందీశ్వర సూట్స్	03	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	17	448
పార్వతీపురం స్పెషల్	16	672
పార్వతీపురం సాధారణ	22	336

– వేములవాడ

సికింద్రాబాద్‌లో సిరిసిల్ల కళాకారుల ప్రదర్శన



సిరిసిల్ల: విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న సిరిసిల్ల చిందు కళాకారులు

సిరిసిల్ల: ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా సికింద్రాబాద్‌లో మంగళవారం జరిగిన ర్యాలీలో జిల్లాలోని తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లె, సారంపల్లి చిందుకళాకారులు పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించిన మంద కృష్ణ మాదిగకు మద్దతుగా విజయోత్సవ ర్యాలీలో చిందుకళాకారులు ప్రదర్శన నిర్వహించారు. సికింద్రాబాద్ నుంచి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జరిగే సభ వరకు కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. చిందు కళాకారులు రాయల ప్రభాకర్, పూర్ణచందర్, గడ్డం మధుసూదన్, చంద్రమౌళి, ఓంకార్ దేవేందర్, సింహాద్రి శ్రీనివాస్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిన నాయకులు

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు నుంచి హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న విజయోత్సవ ర్యాలీకి అంబేద్కర్ సంఘం నాయకులు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ మాట్లాడారు. హైదరాబాద్ తరలివెళ్లిన వారిలో అంబేడ్కర్ సంఘం నాయకులు చుంచు దేవయ్య, బడుగు స్వామి, బడుగు నాగరాజు, శ్రీనివాస్, లింగయ్య, లక్ష్మి నర్సు, పూర్ణ చందర్, ఎల్లయ్య, రాజయ్య, పోచయ్య, లచ్చయ్య, కిష్టయ్య, రమేశ్ తదితరులున్నారు.

తంగళ్లపల్లి: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ సాధించి ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న మందకృష్ణ మాదిగకు స్వాగతం పలికేందుకు ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతనిధి బొల్లారం చంద్రమౌళి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ పసుల కమలాకర్, సీనియర్ నాయకులు తాండ్రాల తిరుపతి, బొల్లి కరుణాకర్, సుధాకర్, మధుసూదన్, జంగాపల్లి రాజు, జీవన్, బూడిద రాజు, జీవన్, సంతోష్, కొమ్మెట దేవయ్య తదితరలున్నారు.

రైతులకు అవగాహన



వేములవాడరూరల్: మండలంలోని హన్మాజీపేట రైతు వేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న పంటలో సమగ్ర యాజమాన్యం, వివిధ పంటల్లో పురుగు మందుల అవశేషాలపై రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు పామాయిల్‌పై ఆసక్తి పెంచేందుకు పామాయిల్ మొక్కలు నాటించారు. జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కే ఆర్ లత, వేములవాడ ఉద్యానవన శాఖ అధికారి లోకేష్, వ్యవసాయ విస్తరణ అధికారి బి.సందీప్, ఆయిల్‌పామ్ కంపెనీ అధికారి నితీశ్, రైతులు పాల్గొన్నారు.

● పదోన్నతితో బాధ్యతలు పెంపు

సిరిసిల్ల ఎడ్యుకేషన్: పదోన్నతితో వారిపై మరింత బాధ్యత పెరుగుతుందని వీఎంఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులను సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్లో సన్మానించారు.

ఆర్థికసాయం అందజేత

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్లలో గుండెపోటుతో మృతి చెందిన రాజేశ్ కుటుంబానికి లంబాడీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో రూ.10వేలు, 25 కిలోల బియ్యం, నిత్యాసర సరుకులు అందజేశా రు. ఇక్కడ అశోక్, సాత్విక్, లైవ్ జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్, ఇస్లావత్ రాజు, అరుణ్,తదితరులున్నారు.

సీఐకి కృతజ్ఞతలు తెలిపిన దివ్యాంగులు

సిరిసిల్లటౌన్: దివ్యాంగురాలిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రబుద్ధుడికి టౌన్ సీఐ తగిన గుణపాఠం చెప్పారు. మంగళవారం దివ్యాంగులు మీడియాతో మాట్లాడారు. పట్టణంలో దివ్యాంగురాలైన రంగు లక్ష్మి రోడ్డుపై వెళ్తుండగా అడ్డుగా ఉన్న ఆటోను జరపాలని కోరింది. సదరు ఆటోవ్యక్తి లక్ష్మిపై చులకన చేస్తూ మాట్లాడాడు. దీంతో బాధితురాలితో జిల్లా దివ్యాంగుల సంఘం నేతలు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. స్పందించిన టౌన్ సీఐ కృష్ణ సదరు ఆటోవ్యక్తిని పిలిపించి మందలించగా లక్ష్మికి క్షమాపణ చెప్పాడు. దీంతో సీఐ కృష్ణకు దివ్యాంగుల సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల పాఠశాల సందర్శన

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ గదుల్లో చెత్తాచెదారం ఉందని సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి కాశీచరణ్, ఉపాధ్యక్షుడు ఇటికల రాజు, మహేందర్ తదితరులున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899